

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

విజయకెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



అక్టోబర్ 11 ఆదివారం 2026 | సంపుటి : 18 | సంచిక : 248 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

SUNDAY OCTOBER 11 2026 | VOL:18 | ISSUE: 248 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

పట్టభద్రుల మద్దతు కూడగట్టండి.. కాంగ్రెస్ శ్రేణులకు పొంగులేటి పిలుపు

ఖమ్మం, అక్టోబర్ 10:

జిల్లాలో ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందని.. ఇందిరమ్మ ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. త్వరలోనే మరిన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో పట్టభద్రుల మద్దతు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించాలని పార్టీ నాయకులు.. కార్యకర్తలకు సూచించారు.ప్రభుత్వంపై ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమం విషయంలో రాజీపడటం లేదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రిపోర్టర్



ఎల్‌నినోపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష.. కొవిడ్ తరహాలో యాక్షన్ ప్లాన్‌కు ఆదేశం..

హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని ముందుగానే గుర్తించి, సమర్థంగా ఎదుర్కొనేందుకు పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది జూన్ వరకు నీరు, వ్యవసాయం, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయకపోతే భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కొవిడ్ సంక్షోభాన్ని ఎదుర్కొన్న తరహాలోనే ఎల్‌నినోతో తలెత్తే సమస్యలనూ అధిగమించేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని రేవంత్ స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ సమస్యలు తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు.అవసరమైతే విద్యుత్ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందన్నారు ముఖ్యమంత్రి. అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమైన పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందని అంశమని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను చెప్పుకొచ్చారు.



'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!



ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ

అరెస్టులకు, నిర్బంధాలకు భయపడబోమని స్పష్టీకరణ

మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్‌ల లక్షణం పిరికితనం అని వ్యాఖ్య

సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల నిరసనల నేపథ్యంలో వ్యాఖ్యలు

రాజ్యాంగాన్ని కాపాడటమే తమ లక్ష్యమని వెల్లడి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు."మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే

(మిగతా 2వ పేజీలో..)

'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్



ఢిల్లీలో అంక్షలు విధించడంపై కాంగ్రెస్ అభ్యంతరం

యువత నిరసన హక్కును అడ్డుకుంటున్నారని ఆరోపణ

మోదీ, అమిత్ షాలపై ప్రియాంకా విమర్శలు

ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలన్న జైరాం రమేశ్

ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని కాంగ్రెస్ డిమాండ్

ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు

(మిగతా 2వ పేజీలో..)

తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు

ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన తొమ్మిది రోజుల ఉత్సవాలు

సంప్రదాయ వస్త్రాల్లో మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం భారీ ఏర్పాట్లు

హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై సద్దుల బతుకమ్మకు ప్రత్యేక ఏర్పాట్లు



తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ ఉత్సవాలు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ

(మిగతా 2వ పేజీలో..)

అఖిలేశ్ రెడీనా? అయోధ్య నుంచి పోటీకి యోగి బహిరంగ సవాల్!

అయోధ్య నుంచి పోటీకి సిద్ధమన్న యోగి

అఖిలేశ్‌తో నేరుగా పోటీకి సవాల్

సమాజ్‌వాదీ పార్టీపై యోగి తీవ్ర విమర్శలు

రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై అభ్యంతరం

ఎన్డీయేకు 80 శాతం సీట్లు వస్తాయని ధీమా

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అయోధ్య నుంచి పోటీ చేయాలన్న సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సవాల్‌ను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వీకరించారు. అయితే ఒక షరతు విధించారు. అఖిలేశ్ కూడా అయోధ్య నుంచి



(మిగతా 2వ పేజీలో..)



విజయకేరటం
తెలుగు దినపత్రిక

సం పా దకీయం

సైబర్ మోసాల వేల.. అప్రమత్తతే అసలైన రక్షణ!

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ మనిషి జీవన విధానంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బ్యాంకింగ్ లావాదేవీల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపుల వరకు, ఆన్‌లైన్ షాపింగ్ నుంచి టికెట్ల బుకింగ్ వరకు దాదాపు ప్రతి సేవ డిజిటల్ రూపంలో అందుబాటులోకి వచ్చింది. మొబైల్ ఫోన్ చేతిలో ఉంటే చాలు.. ఇంటి నుంచే అనేక పనులు పూర్తి చేసుకునే సౌకర్యం ఏర్పడింది. అయితే సాంకేతికతతో ప్రయోజనాలు పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్ల మోసాలు కూడా కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయి. ప్రజల అమాయకత్వాన్ని, అత్యాశను, భయాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు డబ్బు కాజేస్తున్నారు.

అత్యాశే మోసగాళ్లకు ఆయుధం

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయనే ప్రకటనలు, ఇంటి నుంచే భారీ ఆదాయం పొందవచ్చనే సందేశాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో తక్కువ సమయంలో డబ్బు రెట్టింపు అవుతుందనే హామీలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. మొదట చిన్న మొత్తాలను పెట్టుబడిగా పెట్టించి నమ్మకం కలిగించడం, ఆ తర్వాత పెద్ద మొత్తాలను జమ చేయించి చివరకు బాధితులను మోసం చేయడం సైబర్ నేరాల్లో కనిపించే పద్ధతుల్లో ఒకటి.అలాగే గుర్తింపు లేని సంస్థల పేరుతో వచ్చే ఉద్యోగ ప్రకటనలు, బహుమతులు గెలుచుకున్నారంటూ పంపే సందేశాలు, అనుమానాస్పద వెబ్‌సైట్లు కూడా ప్రమాదకరమే. నిజానిజాలు పరిశీలించకుండా స్పందిస్తే ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. కష్టపడి సంపాదించిన డబ్బును పెట్టుబడి పెట్టే ముందు సంస్థ విశ్వసనీయతను పరిశీలించడం ప్రతి ఒక్కరికీ అవసరం.

ఓటీపీ చెప్పొద్దు.. వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు

బ్యాంకు అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులమని పరిచయం చేసుకుంటూ కొందరు ఫోన్ కాల్స్ చేస్తున్నారు. ఖాతా నిలిచిపోతుందని, కేవైసీ వివరాలు నవీకరించకపోతే సేవలు ఆగిపోతాయని, బహుమతి పొందాలంటే సమాచారం ఇవ్వాలని నమ్మిస్తున్నారు. ఈ క్రమంలో బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు, కార్డు సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.బ్యాంకులు లేదా ఇతర సంస్థల పేర్లు చెప్పినంత మాత్రాన ఫోన్ చేసిన వ్యక్తిని నమ్మకూడదు. ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్ వంటి రహస్య వివరాలను ఇతరులతో పంచుకోకూడదు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకూడదు. ఏదైనా సమాచారం నిజమో కాదో తెలుసుకోవాలంటే సంబంధిత సంస్థ అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక కస్టమర్ సేవలను స్వయంగా సంప్రదించాలి.

డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టే మోసాలు

ఇటీవలి కాలంలో చట్ట అమలు సంస్థల అధికారులమని చెప్పుకుంటూ ప్రజలను భయపెట్టే మోసాలపై అప్రమత్తత అవసరం. పార్సిల్‌లో అక్రమ వస్తువులు ఉన్నాయని, మీ పేరుతో నేరం నమోదైందని, పోలీసుల విచారణకు సహకరించాలంటూ కొందరు వీడియో కాల్స్ ద్వారా ఒత్తిడి చేస్తారు. అరెస్టు చేస్తామని బెదిరిస్తూ డబ్బు బదిలీ చేయాలని కోరవచ్చు.ఇలాంటి సందర్భాల్లో భయాందోళనలకు గురై డబ్బు పంపడం సరికాదు. నిజమైన అధికారిక ప్రక్రియకు బదులుగా వీడియో కాల్‌లోనే కేసు పరిష్కరిస్తామని చెప్పడం, రహస్యంగా డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలు అనుమానాస్పద సంకేతాలు. వెంటనే కాల్‌ను నిలిపివేసి, సంబంధిత పోలీసు విభాగాన్ని అధికారిక మార్గాల్లో సంప్రదించాలి. కుటుంబ సభ్యులతో చర్చించకుండా తొందరపడి నిర్ణయాలు తీసుకోకూడదు.

సోషల్ మీడియా పరిచయాల్లోనూ జాగ్రత్త

సోషల్ మీడియా ద్వారా కొత్త పరిచయాలు ఏర్పడటం సాధారణమైంది. అయితే ప్రతి ఆన్‌లైన్ పరిచయం నిజమైనదే అని భావించడం ప్రమాదకరం. నకిలీ ఖాతాలతో స్నేహం చేసి వ్యక్తిగత ఫొటోలు, వివరాలు సేకరించడం, తర్వాత వాటిని బయటపెడతామని బెదిరించడం, డబ్బు వసూలు చేయడం వంటి నేరాలు జరగవచ్చు.వ్యక్తిగత ఫొటోలు, గుర్తింపు పత్రాలు, చిరునామా, బ్యాంకు వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకూడదు. అనుమానాస్పద ఖాతాలను బ్లాక్ చేసి సంబంధిత వేదికకు ఫిర్యాదు చేయాలి. బెదిరింపులకు గురైనప్పుడు నిందితుల మాటలకు భయపడి డబ్బు చెల్లించడం కంటే సాక్ష్యాలను భద్రపరిచి అధికారులకు ఫిర్యాదు చేయడం మంచిది.

వృద్ధులు, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన అవసరం

డిజిటల్ సేవలను ఉపయోగించే ప్రతి ఒక్కరికీ సైబర్ భద్రతపై సమాన అవగాహన ఉండదు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానంపై తక్కువ పరిచయం ఉన్న వృద్ధులు, విద్యార్థులు, కొత్తగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ ప్రారంభించినవారు మోసగాళ్ల బారిన పడే ప్రమాదం ఉంది. కుటుంబ సభ్యులు వారికి ఓటీపీలు పంచుకోకూడదని, అనుమానాస్పద లింకులను తెరవకూడదని, తెలియని వ్యక్తుల సూచనలతో డబ్బు బదిలీ చేయకూడదని వివరించాలి. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. బ్యాంకులు, స్థానిక సంస్థలు, పోలీసు శాఖ ప్రజలకు అందుబాటులో ఉండే సరళమైన సమాచారాన్ని అందించాలి. మోసగాళ్లు ఉపయోగించే కొత్త పద్ధతులపై ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయడం అవసరం.

మోసానికి గురైతే వెంటనే స్పందించాలి

సైబర్ మోసానికి గురైన తర్వాత ఆలస్యం చేయడం వల్ల డబ్బు తిరిగి పొందే అవకాశాలు తగ్గవచ్చు. అందువల్ల అనుమానాస్పద లావాదేవీ జరిగిన వెంటనే బ్యాంకును సంప్రదించి ఖాతా లేదా సంబంధిత చెల్లింపు మార్గాన్ని భద్రపరచేందుకు చర్యలు తీసుకోవాలి. భారతదేశంలో సైబర్ ఆర్థిక మోసాలపై 1930 హెల్ప్‌లైన్‌కు వెంటనే ఫోన్ చేయవచ్చు. అలాగే అధికారిక జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ఎఎవలీఎతీఱఎవ.స్రశీజ.ఱఅ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు బదిలీ వివరాలు, సందేశాలు, ఫోన్ నంబర్లు, లావాదేవీ రశీదులు, స్క్రీన్‌షాట్‌లు వంటి ఆధారాలను తొలగించకుండా భద్రపరచాలి. సైబర్ నేరంపై ఫిర్యాదు చేయడం బాధితుడి తప్పు కాదు. సిగ్గు లేదా భయం కారణంగా ఫిర్యాదు చేయకుండా ఉండటం నేరగాళ్లకు మరింత అవకాశం కల్పిస్తుంది.

చట్టాల అమలుతో పాటు ప్రజల భాగస్వామ్యం

సైబర్ నేరాలను నియంత్రించేందుకు పోలీసు వ్యవస్థ ఆధునిక సాంకేతికతను వినియోగించాలి. బ్యాంకులు అనుమానాస్పద లావాదేవీలను గుర్తించే వ్యవస్థలను బలోపేతం చేయాలి. ఆన్‌లైన్ వేదికలు నకిలీ ఖాతాలు, మోసపూరిత ప్రకటనలపై వేగంగా స్పందించాలి. వివిధ సంస్థల మధ్య సమన్వయం పెరిగితే బాధితులకు సహాయం అందించడం మరింత సులభమవుతుంది.అదే సమయంలో ప్రజలు కూడా డిజిటల్ సేవలను బాధ్యతాయుతంగా వినియోగించాలి. సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన లేకపోయినా జాగ్రత్తలు పాటించడం సాధ్యమే. సందేశాన్ని పంపిన వ్యక్తి నిజంగా ఎవరన్నది పరిశీలించడం, అసూహ్యమైన లాభాల హామీలను అనుమానించడం, డబ్బు పంపే ముందు ధృవీకరించడం వంటి సాధారణ చర్యలే అనేక మోసాలను అడ్డుకోగలవు.

అప్రమత్తతే మొదటి రక్షణ కవచం

డిజిటల్ ప్రపంచం నుంచి పూర్తిగా దూరంగా ఉండటం పరిష్కారం కాదు. దాని ప్రయోజనాలను అందిపుచ్చుకుంటూనే ప్రమాదాలను గుర్తించడం ముఖ్యం. ప్రతి లింకును నమ్మడం, ప్రతి ఫోన్ కాల్‌కు స్పందించడం, ప్రతి లాభదాయకమైన ప్రకటన వెనుక నిజాయితీ ఉందని భావించడం మానుకోవాలి. ఆగి ఆలోచించడం, నిజానిజాలను పరిశీలించడం, అవసరమైతే ఇతరుల సలహా తీసుకోవడం అలవాటు చేసుకోవాలి.లిలిసాంకేతికత మన జీవితాన్ని సులభతరం చేయాలి తప్ప.. కష్టపడి సంపాదించిన డబ్బును, వ్యక్తిగత గోప్యతను ప్రమాదంలోకి నెట్టకూడదు. సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసుల చర్యలు ఎంత ముఖ్యమో ప్రజల అప్రమత్తత కూడా అంతే ముఖ్యం. అత్యాశకు దూరంగా ఉండటం, భయపెట్టే కాల్స్‌కు లొంగకపోవడం, రహస్య సమాచారాన్ని భద్రంగా ఉంచడం ద్వారా సైబర్ మోసాల ప్రమాదాన్ని తగ్గించవచ్చు. డిజిటల్ యుగంలో అవగాహనే ఆయుధం.. అప్రమత్తతే అసలైన రక్షణ!

పట్టభద్రుల మద్దతు కూడగట్టండి.. కాంగ్రెస్ శ్రేణులకు పొంగులేటి పిలుపు

మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులకు సంబంధించిన బకాయిలను రూ.9 వేల కోట్లతో చెల్లించామని వెల్లడించారు. ఉద్యోగ నియామకాలు.. ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాల్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను పట్టభద్రులకు వివరించాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య, గిద్దంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌నినోపై సీఎం రేవంత్ రెడ్డి కీలక సమీక్ష.. కొవిడ్ తరహాలో యాక్షన్ ప్లాన్‌కు ఆదేశం..

మొదటి పేజీ తరువాయి)

విద్యుత్‌పై ఆధారపడే పనులను సాధ్యమైనంత వరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రతరం కాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. చుక్క నీరు కూడా వృథా కాకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి లభ్యత, వ్యవసాయ అవసరాలు, విద్యుత్ వినియోగం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే సమస్యలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని రేవంత్ రెడ్డి తెలిపారు. సినిమా, మీడియా, కళాజాతలతో పాటు వివిధ మాధ్యమాలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలకు అవగాహన కల్పించి నీరు, విద్యుత్ పొదుపులో వారిని భాగస్వాములను చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రేవంత్ స్పష్టం చేశారు.

తెలంగాణలో ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు

మొదటి పేజీ తరువాయి)

సాంస్కృతిక అస్థిత్వానికి, ప్రకృతితో ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పూల పండుగ తొమ్మిది రోజుల పాటు కొనసాగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, యువతులు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన మహిళలు, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకుని ఆలయాలు, సామూహిక ప్రదేశాలకు తరలివచ్చారు. గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ, చప్పట్లతో సందడి చేశారు. చారిత్రక హనుమకొండలోని వెయ్యి స్తంభాల గుడిలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పారామంలోనూ ఉత్సవాలు నిర్వహించారు.నేడు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు, అక్టోబర్ 18న జరిగే సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అక్టోబర్ 20న దసరా పండుగ జరగనుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత, నైవేద్యం ఉంటుంది.ఈ ఉత్సవాల కోసం తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ఏర్పాట్లు చేసింది. ప్రధాన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించింది. అక్టోబర్ 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రధాన సద్దుల బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సచివాలయం సమీపంలోని అమరవీరుల స్థూపం నుంచి మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘాట్ల వద్ద నిమజ్జనం చేస్తారు. ఈ కార్యక్రమానికి భారీగా తరలివచ్చే ప్రజల కోసం ట్రాఫిక్ మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు వంటి పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలల్లోనూ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. తంగేడు, గునుగు వంటి సంప్రదాయ పూలతో బతుకమ్మలను పేరుస్తూ, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నారు.

అఖిలేశ్ రెడీనా? అయోధ్య నుంచి పోటీకి యోగి బహిరంగ సవాల్!

మొదటి పేజీ తరువాయి)

బరిలోకి దిగాలని ప్రతి సవాల్ విసిరారు. ఇద్దరి మధ్య నేరుగా పోటీ జరగాలని అన్నారు. శనివారం బలరాంపూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న యోగి ఈ వ్యాఖ్యలు చేశారు.అఖిలేశ్ యాదవ్‌పై యోగి తీవ్ర విమర్శలు చేశారు. సమాజ్‌వాదీ పార్టీకి కుటుంబం గురించి తప్ప మరో ఆలోచన లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ ఇద్దరు అభ్యర్థులను బరిలోకి దింపిందని చెప్పారు. వారిలో అఖిలేశ్ బాబాయి రామ్ గోపాల్ యాదవ్ ఒకరని, మరో సీటును పారిశ్రామికవేత్త ధన్‌రాజ్ పరిమల్ నత్వానీకి కేటాయించారని విమర్శించారు. వెనుకబడిన వర్గాలు, దళితులు, బ్రాహ్మణులు సహా ఇతర వర్గాలకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు.సమాజ్‌వాదీ పార్టీ చెప్పే 'పీడీఏ'కు కుటుంబ అభివృద్ధి సంస్థ, రాష్ట్రాన్ని ముంచే కూటమి అని కొత్త అర్థాలు చెబుతూ యోగి విమర్శలు గుప్పించారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీ పాలనలో యువతకు ఉద్యోగాలు రాలేదని, రైతులు ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. అయోధ్యలో గతంలో రోజుకు మూడు, నాలుగు గంటలే విద్యుత్ సరఫరా ఉండేదని, పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉండేవని యోగి అన్నారు. ఇప్పుడు ఆ నగరం రామరాజ్యానికి ఉదాహరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 80 శాతం సీట్లు ఎన్డీయే గెలుస్తుందని యోగి ధీమా వ్యక్తం చేశారు. మిగిలిన సీట్లు ఇతర పార్టీలకు వెళ్లినా బలరాంపూర్ అభివృద్ధి ఆగదని చెప్పారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై జరుగుతున్న నిరసనలను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు హద్దులు దాటి వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు.

'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'.. ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!

మొదటి పేజీ తరువాయి)

ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10-15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు.ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు. నిరసన స్థలానికి చేరుకోవడానికి ప్రయత్నించిన పలువురిని అదుపులోకి తీసుకుని, భారీగా పోలీసులను మోహరించారు. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ పై వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఎన్నికల అంశాలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు సాగిస్తున్న పోరాటంలో భాగంగానే రాహుల్ ఈ ప్రకటన చేశారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
అక్టోబర్ | ఆదివారం | 11 | 2026

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి





- **వచ్చే జూలై వరకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్గొండ, అక్టోబర్ 10 (విజయ కెరటం):

రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం అన్ని రంగాలపై పడే అవకాశం ఉన్నందున, వచ్చే జూలై వరకు అవసరమైన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, వ్యవసాయం, ఉపాధి, పశు గ్రాసం తదితర రంగాల్లో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.సీజనల్ పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన నేపథ్యంలో, సోమవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చించనున్నందున శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. రానున్న 270 రోజులపాటు అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రజాప్రతినిధులు, రైతులతో సమన్వయం చేసుకుంటూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎండల తీవ్రతతో తాగునీటి సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. బోర్ల రీఛార్జ్, పైపులైన్ల మరమ్మతులు, ఇతర అవసరమైన పనులకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల వారీగా వచ్చే మూడు నెలలకు తాగునీటి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మున్సిపాలిటీల్లో అమృత్ పనులను పూర్తి చేయడంతో పాటు స్థానిక నీటి వనరుల అభివృద్ధి, చిన్నచిన్న మరమ్మతులను వెంటనే చేపట్టాలని స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పనులకు ప్రాధాన్యం

వర్షాలు తగ్గి పంటలు దెబ్బతినే పరిస్థితులు ఏర్పడితే రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడకుండా ఉపాధి హామీ పథకం కింద పెద్దఎత్తున పనులను గుర్తించి ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో పనులు చేపట్టి గ్రామీణ ఆస్తుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వాననీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్‌ను నియమించాలని సూచించారు. చేపట్టే పనుల వివరాలను సర్పంచులు, వార్డు సభ్యులకు ముందుగానే తెలియజేయాలని, నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఎండిపోయిన బావులు, బోర్ల వద్ద రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టడంతో పాటు మ్యాజిక్ సోక్ పిట్లు, ఫామ్ పాండ్లు, పెర్కొలేషన్ ట్యాంకుల నిర్మాణంపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

భూగర్భ జలాలపై ప్రత్యేక నివేదిక

జిల్లాలో సాగు చేసిన పంటలు, ఎండిపోయిన పంటలు, ఇతర వ్యవసాయ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, గత ఏడాది-ప్రస్తుత ఏడాది పరిస్థితులను పోల్చి నివేదిక ఇవ్వాలని భూగర్భ జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో ఏయే మండలాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందో విశ్లేషించి వివరాలు సమర్పించాలన్నారు.జిల్లాలోని 16 మండలాల్లో సగటు కంటే తక్కువ భూగర్భ జలాలు ఉన్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భ జలమట్టం రెండు మీటర్లు తగ్గినట్లు తెలిపారు. జలమట్టం తగ్గడానికి గల కారణాలను కూడా విశ్లేషించాలని కలెక్టర్ ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, భవిష్యత్తులో వినియోగించుకోగల నీటి పరిమాణంపై చెరువు, రిజర్వాయర్ వారీగా నివేదికలు సమర్పించాలని సూచించారు.

పశువులకు తాగునీరు, పశుగ్రాసం అందేలా చర్యలు

రానున్న రోజుల్లో పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా పశుసంవర్ధక శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన పశు గ్రాసం, నీటి లభ్యతపై అంచనాలతో కూడిన నివేదిక సమర్పించాలన్నారు.ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పనిచేయాలని, ప్రజలకు అండగా నిలుస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ సమరానికి 'వర్షిణి' సిద్ధం!





అశ్వారావుపేటలో జరిగే జూనియర్ బాలికల పోటీల్లో జిల్లా ప్రాతినిధ్యం

గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయికి ఎదిగిన తిప్పర్తి కిరణం

హర్షం వ్యక్తం చేసిన ప్రధానోపాధ్యాయులు పి. నరసింహ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయుడు లెనిన్ బాబు

తిప్పర్తి: అక్టోబర్ 10 విజయకేరటం ప్రతినిధి



గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తే వారు జాతీయ, రాష్ట్ర స్థాయిలలో సత్తా చాటుతారని తిప్పర్తి విద్యార్థిని జెర్రిపోతుల వర్షిణి మరోసారి నిరూపించింది. నల్గొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని PM SHRI ZPHS పాఠశాలలో చదువుతున్న వర్షిణి, తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైంది.ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో ఆమె ప్రదర్శించిన అత్యుత్తమ రైడింగ్, డిఫెన్స్ మెళకువలు, శారీరక దారఢ్యం క్రీడాభిమానులను, నిర్వాహకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దాంతో ఆమె రాష్ట్రస్థాయి జట్టులో చోటు దక్కించుకుంది.

33 జిల్లాల క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ప్రాంగణంలో ఈ నెల అక్టోబర్ 10 నుండి 13 వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వర్షిణి పాల్గొననుంది. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల నుంచి అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో తలపడనుండగా, మన జిల్లా తరపున వర్షిణి ముఖ్య భూమిక పోషించనుందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నిమ్మల లెనిన్ బాబు తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే వర్షిణికి కబడ్డీపై ఉన్న ప్రత్యేక ఆసక్తి, నిరంతర సాధన ఈ స్థాయికి చేర్చాయని ఆయన కొనియాడారు.



క్రీడల్లో రాణిస్తే బాసటగా నిలుస్తాం

హెచ్‌ఎం పి. నరసింహ నాయక్

వర్షిణి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ పి. నరసింహ నాయక్ ప్రత్యేక హర్షం వ్యక్తం చేశారు. వర్షిణిని పూలమాలలు, శాలువాతో ఘనంగా అభినందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ వర్షిణి తన ప్రతిభతో ప్రతి ప్రత్యర్థిని చిత్తు చేసి, జిల్లాకు అలాగే పాఠశాలకు బంగారు పతకంతో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పాఠశాల వ్యాప్తంగా పండుగ వాతావరణం

తన ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికైన వర్షిణిని సీనియర్ ఉపాధ్యాయులు దామోదర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు ఆత్మీయంగా అభినందించారు. వర్షిణి విజయం తోటి విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని నింపిందని, క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరిగేలా చేసిందని ఉపాధ్యాయులు తెలిపారు. జెర్రిపోతుల వర్షిని తన తండ్రి సీనియర్ జర్నలిస్టు జేరిపోతుల సైదులు గౌడ్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించి తన కూతుర్ని మగ పిల్లలతో సమానంగా పెంచి ఈ స్థాయికి ఎదిగేందుకు కృషి చేశారని వర్షిని తెలిపారు తన తల్లిదండ్రులు తన మీద ఎంతో ఆశ పెట్టుకున్నారని తాను వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటానని వారికి మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు

ఇల్లంద చెరువుకు మహర్దశ!

రూ.41.85 లక్షలతో మరమ్మతు పనులకు ఎమ్మెల్యే నాగరాజు శంకుస్థాపన

వరంగల్ విజయ కెరటం, 10 అక్టోబర్ :



రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటమే లక్ష్యంగా చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వనరులను బలోపేతం చేసి రైతులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు.వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని ఊర చెరువు



మరమ్మతులు, ఆధునికీకరణ పనులకు రూ.41.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు శనివారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువు కట్ట బలహీనపడటంతో వర్షాకాలంలో రైతులు, గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. మరమ్మతు పనులు పూర్తయితే చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరిగి, వందలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యం, ఐనవోలు దేవాలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, సర్పంచ్ చీటూరి రాజు, నాయకులు కుల్ల యాకాంతం, నాంపెల్లి రవి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడా ఎంపికలు ప్రారంభించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్

యాదాద్రి--ఎ జోన్ స్థాయి ఎంపికలకు శ్రీకారం.. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి

నల్లగొండ, అక్టోబర్ 10 (విజయ కెరటం):



5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలో భాగంగా నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం యాదాద్రి--ఎ జోన్ స్థాయి క్రీడా ఎంపికలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



ఐపీఎస్ ప్రారంభించారు. పోలీస్ సిబ్బందిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, రాష్ట్రస్థాయి పోటీలకు ప్రతిభావంతులైన క్రీడాకారులను ఎంపిక చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రీడా పోటీల్లో భాగంగా క్లస్టర్-ణ పోటీలు నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో, క్లస్టర్-ఱు పోటీలు నవంబర్ 25 నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో పురుషులు, మహిళలకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి.యాదాద్రి--ఎ జోన్ స్థాయి ఎంపికల్లో పాల్గొన్న పోలీస్ క్రీడాకారుల క్రీడా నైపుణ్యం, శారీరక సామర్థ్యం, ప్రదర్శన ఆధారంగా ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు.పోలీస్ విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయపాలన, జట్టుగా పనిచేసే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని ఎస్పీ పేర్కొన్నారు. క్రీడలు సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంచి, విధి నిర్వహణలో మరింత చురుకుదనాన్ని అందిస్తాయని తెలిపారు. పోలీస్ సిబ్బందిలోని క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ, మెరుగైన ఫలితాలు సాధించేందుకు శాఖ తరఫున అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు సంతోష్, హరిబాబు, శ్రీను, పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

భద్రకాళి పూలంగి సేవ మా అదృష్టం!ఎంపీ రవిచంద్రకు ఆహ్వానం

వరంగల్ విజయ కెరటం, 10 అక్టోబర్ :



ఓరుగల్లు శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు వద్దిరాజు రవిచంద్ర కుటుంబానికి ఆలయ అధికారులు ఆహ్వానం అందించారు.శనివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామల సునీత, ఆలయ ప్రధాన అర్చకులు శేషు అయ్యగారు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి అమ్మవారి ఆహ్వాన పత్రిక, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎంపీ రవిచంద్ర కూడా అర్చకులను శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి, శేష వాహనాలకు ఉదయం, సాయంత్రం పూలంగి సేవ నిర్వహించే భాగ్యం తమ కుటుంబానికి కలగడం అదృష్టమని తెలిపారు. భక్తులందరూ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.ఎంపీ రవిచంద్రతో పాటు ఆయన సతీమణి విజయలక్ష్మి, కుమారుడు వద్దిరాజు సాయి నిఖిల్ చంద్ర, కోడలు అనిలా, సోదరులు వద్దిరాజు కిషన్--శశిరేఖ, వద్దిరాజు దేవేందర్--ఇందిర, వద్దిరాజు వెంకటేశ్వర్లు--ఉమామహేశ్వరి దంపతులకు కూడా అమ్మవారి ఆహ్వాన పత్రికలు, తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అర్చకులు అరవింద్ శర్మ, భరద్వాజ్ శర్మ, ఆలయ పర్యవేక్షకుడు కూచన హరినాథ్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

పద్మాక్షి దేవి ఉత్సవాలకు ఆహ్వానం

హనుమద్గిరి పద్మాక్షి దేవి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా హాజరుకావాలని కోరుతూ ఆలయ అర్చకులు నాగిళ్ల షణ్ముఖ శర్మ ఎంపీ వద్దిరాజు రవిచంద్రను ఆయన నివాసంలో కలిసి అమ్మవారి ఆహ్వాన పత్రిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

సీనియర్ నాయకుడు దండెంపల్లి మారయ్య మృతి.. జిల్లా నాయకుల నివాళులు

నల్లగొండ, అక్టోబర్ 10 (విజయ కెరటం):



సీపీఎం సీనియర్ సభ్యుడు, కల్లుగీత కార్మిక సంఘం నాయకుడు దండెంపల్లి మారయ్య మృతి ఆ ప్రాంత ప్రజలకు, సీపీఎం పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం అనారోగ్యంతో మృతి చెందిన మారయ్య పార్థివదేహానికి సుధాకర్ రెడ్డితో పాటు పలువురు సీపీఎం జిల్లా నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక ప్రజా పోరాటాల్లో మారయ్య ముందుండి పాల్గొన్నారని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించడం, కల్లుగీత కార్మికులకు లైసెన్సులు, గుర్తింపు కార్డులు ఇప్పించడం కోసం ఆయన విశేషంగా కృషి చేశారని కొనియాడారు.మారయ్య ఆశయమైన దోపిడీ లేని సమసమాజ స్థాపన కోసం పోరాటం కొనసాగించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు కూడా పేదల హక్కుల కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావాలని కోరుతూ, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హషం, జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, మండల కార్యదర్శి నలపరాజు సైదులు, పట్టణ కమిటీ సభ్యులు దండెంపల్లి సరోజ, అవుట రవీందర్, శాఖ కార్యదర్శి పనస చంద్రయ్య, శాఖ సభ్యుడు దండెంపల్లి యాదయ్య, కుటుంబ సభ్యులు శంకర్, ఆంజనేయులు, పెద్దిరాజు, వెంకన్న, యాదగిరి, కలమ్మ, జయమ్మ, జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

పలువురు ప్రముఖుల సంతాపం

మాజీ సర్పంచ్ గుజ్జుల జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి దండెంపల్లి పరశురాం, వెంకన్న, పాలకూరి సంతోష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ దండెంపల్లి సత్తయ్య, మక్కపల్లి అంజయ్య, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు షేక్ రఫీ, పజ్జూరు శంకరయ్య, రమేష్ తదితరులు మారయ్య మృతదేహానికి నివాళులర్పించి సంతాపం తెలిపారు.

ఈ నెల 15న దర్గా హజ్రత్ సయ్యద్ షా మినుల్లాహా షా ఖాద్రీ (ర.అ) సందల్ షరీఫ్



నల్గొండ, విజయ కెరటం ప్రతినిధి:

నల్గొండ పట్టణంలోని ఓల్డ్ సిటీ చౌరస్తా వద్ద ఉన్న దర్గా హజ్రత్ సయ్యద్ షా మినుల్లాహా షా ఖాద్రీ (ర.అ) సందల్ షరీఫ్ కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. అసర్ నమాజ్ అనంతరం సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ కార్యక్రమాన్ని అబ్దుల్ కరీం ఖాన్ (అబ్బు), దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సందల్ షరీఫ్ కార్యక్రమానికి భక్తులు, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

దసరా సెలవుల్లో-ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

మండల విద్యాధికారి

సూర్యాపేట (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విద్యా క్యాలెండర్ ప్రకారం రాష్ట్రంలోని పాఠశాలలకు 2026 అక్టోబర్ 10వ తేదీ నుండి అక్టోబర్ 22వ తేదీ వరకు మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులు ప్రకటించినట్లు సూర్యాపేట మండల విద్యాధికారి తెలిపారు. అక్టోబర్ 23వ తేదీన పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారి, సూర్యాపేట వారి ఆదేశాల మేరకు సూర్యాపేట మండల పరిధిలోని అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ మరియు అన్‌ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.దసరా సెలవుల సమయంలో పదో తరగతి విద్యార్థులతో పాటు ఏ తరగతి విద్యార్థులకూ ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సెలవుల సమయంలో పాఠశాలలను నిర్వహించడం లేదా విద్యార్థులను పాఠశాలలకు పిలిపించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం వంటి చర్యలకు పాల్పడితే, సంబంధిత పాఠశాలలపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, పాఠశాల గుర్తింపు రద్దుకు సంబంధించిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.కావున, అన్ని పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ ఆదేశాలను గౌరవిస్తూ దసరా సెలవులను తప్పనిసరిగా అమలు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించరాదని సూర్యాపేట మండల విద్యాధికారి తెలిపారు.

భద్రకాళి నగర్ లో బతుకమ్మ వేడుకలు....

హన్మకొండ విజయ కెరటం అక్టోబర్ 10....

భీమారం 55 వ డివిజన్ భద్రకాళి నగర్ 2లో బతుకమ్మ మొదటి రోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో, ఆటా పాటలతో ఆనందంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి సి. ఐ. స్వామి గారి ఆధ్వర్యం లో గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి,మరియు సుధీర్ రెడ్డి, ప్రభాకర్, ప్రేమ్ కుమార్,కుమారస్వామి, రవి నాయక్, నందకిశోర్,మురళి గార్లు తగిన ఏర్పాట్లు చేశారు.



పోరాటం ఉన్న చోటే చరిత్ర పుట్టుక





సిద్దిపేట సభలో టీయూడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీ

హైదరాబాద్, అక్టోబర్ 8 విజయ కెరటం ప్రతినిధి

పోరాటం ఉన్న చోటే చరిత్ర పుడుతుందని, ప్రజల ఆకాంక్ష ఉన్న చోటే కొత్త భవిష్యత్తు నిర్మితమవుతుందని, పోరాటాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో...ప్రజల ఆకాంక్షల నుంచి పుట్టిన మరో చారిత్రక అధ్యాయమే సిద్దిపేట జిల్లా అని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అన్నారు. సిద్దిపేట జిల్లా ఆవిర్భావ దశాబ్ది వేడుకలలో భాగంగా శనివారం నాడు సిద్దిపేట పట్టణంలోని విపంచి ఆడిటోరియంలో, కవులు, కళాకారుల నేతృత్వంలో జరిగిన కవిగాయక సమ్మేళనానికి ఆయన విశిష్ట అథితిగా హాజరై ప్రసంగించారు.సిద్దిపేట జిల్లా ఏర్పడడమంటే కేవలం భౌగోలిక చిత్ర పటం పై ఒక మార్పు మాత్రమే కాదని, ప్రజల జీవితాల్లో ఒక దూరం తగ్గిందని, జిల్లా కేంద్రం దూరం తగ్గిందంటే ప్రజలకు పరిపాలన దగ్గరైనట్లని విరాహత్ అలీ అన్నారు. ఈ ప్రాంత పొలాల్లో రైతన్న చెమట పచ్చని పైరై పరవళ్లు తొక్కాలని, బడుల్లో బాలల నవ్వు భవితకు బాటలు వేయాలని, యువత ఉజ్వల భవితకు దీపం కావాలని, ఈ జిల్లా పల్లెల గుండెల్లో అభివృద్ధి నిత్య దీపావళై వెలిగినప్పుడే సాధించుకున్న జిల్లాకు సార్థకత ఉంటుందని ఆయన స్పష్టం చేసారు. పదో ఆవిర్భావ సభ కేవలం సంబరాల సభ కాకూడదని, ఇది రేపటి చరిత్రకు ముందడుగుగా, ప్రజల కన్నీళ్లు తుడిచే ప్రతిజ్ఞగా,

సమానత్వపు స్వప్నానికి శ్రీకారంగా ఉండాలని విరాహత్ అలీ ఆకాంక్షించారు.

ఇంకా ఈ సభలో మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు టి. హరీష్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుసేన్, సీనియర్ పాత్రికేయులు కె. అంజయ్య, తోట అశోక్, మంజీరా రచయితల సంఘం అధ్యక్షుడు కె.రంగాచారీ, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు అయిత చంద్రయ్య, సిద్దిపేట రచయితల సంఘం అధ్యక్షుడు అమ్మనగారి రాంచంద్రారెడ్డిలతో పాటు జిల్లా నలుమూలల నుండి కవులు, రచయితలు, కళాకారులు తరలివచ్చారు.

ఎంగిలిపువ్వు బతుకమ్మను పేర్చిన మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది


సూర్యాపేట (విజయ కెరటం స్టేట్ బ్యూరో గౌస్)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది తన నివాసంలో ఎంగిలిపువ్వు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం సూర్యాపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే అపురూపమైన పండుగగా ప్రసిద్ధి చెందింది. పూలను పూజిస్తూ, ప్రకృతితో మమేకమై మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ఏటా ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలు ఎంగిలిపువ్వు బతుకమ్మతో ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. ప్రతి రోజు ప్రత్యేకమైన ఆచారాలు, సంప్రదాయాలతో బతుకమ్మను పేర్చి పూజలు నిర్వహించడం ఈ పండుగ ప్రత్యేకత.వివిధ రకాల పూలను అందంగా పేర్చి బతుకమ్మను రూపొందించడం, మహిళలంతా ఒకచోట చేరి వలయాకారంలో తిరుగుతూ జానపద గీతాలు ఆలపించడం బతుకమ్మ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈ పండుగ మహిళల మధ్య ఐకమత్యాన్ని పెంపొందించడంతో పాటు కుటుంబ బంధాలను, సామాజిక అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. ప్రకృతి ప్రసాదించిన పూలతో అమ్మవారిని పూజించడం ద్వారా ప్రకృతి పట్ల గౌరవం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను కూడా ఈ పండుగ చాటిచెబుతుంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొనడం వేడుకలకు ప్రత్యేకతను తీసుకొచ్చింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు భావితరాలకు వాటి విశిష్టతను తెలియజేయడంలో బతుకమ్మ వంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయి. మహిళలు తమ సంప్రదాయాలను కొనసాగిస్తూ పండుగలను ఉత్సాహంగా జరుపుకోవడం తెలంగాణ సాంస్కృతిక వైభవానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది జె న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ సూర్యాపేట పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలందరికీ ఎంగిలిపువ్వు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు.



అందుకే, నా సినిమా టికెట్ ధరలు పెంచవద్దని చెబుతాను: విజయ్ దేవరకొండ

యువ హీరో విజయ్ దేవరకొండ తన చిత్రాల టికెట్ ధరల పెంపుపై కీలక వ్యాఖ్యలు చేశాడు. దసరా కానుకగా విడుదల కానున్న తన తాజా చిత్రం 'రణబాలి' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం అన్నపూర్ణ స్టూడియోలో మీడియాతో మాట్లాడాడు. తన పరిధిలో ఉన్నంత వరకు సినిమాల టికెట్ ధరలను పెంచనివ్వబోనని ఈ సందర్భంగా స్పష్టం చేశాడు.తాను విద్యార్థిగా ఉన్న సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులే ఇందుకు కారణమని విజయ్ వివరించాడు. "కళాశాల రోజుల్లో మా నాన్న రోజూ పది రూపాయలు ఇచ్చేవాడు. ఆ నగదును పొదుపు చేసి ఐమ్యాక్స్‌లో సినిమాలు చూసేవాడిని. అప్పట్లో టికెట్ ధర రూ.100 పెరిగినప్పుడు ఎంతో బాధపడ్డాను. అందుకే ఇప్పుడు నా సినిమాల టికెట్ రేట్లు పెంచవద్దని నిర్మాతలకు సూచిస్తుంటాను. అవసరమైతే నా లాభాల్లో వాటాను తగ్గించుకోవడానికైనా సిద్ధమే" అని తెలిపాడు. అయితే, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చిత్రాలకు మాత్రం ఇది మినహాయింపు అని సరదాగా పేర్కొన్నాడు.విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రణబాలి'. ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న దసరా పండుగ సందర్భంగా థియేటర్లలోకి రానుంది. బ్రిటిష్ పాలనలో 1876-78 మధ్య రాయలసీమ ప్రాంతంలో సంభవించిన తీవ్ర కరవు నేపథ్యంలో ఈ చిత్రం రూపొందింది. ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటించగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ కీలక ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించారు. బయోపిక్స్‌ల గురించి మాట్లాడుతూ, తనకు ఎప్పటి నుంచో సత్యసాయి బాబా జీవితగాథలో నటించాలనే ఆసక్తి ఉండేదని, కానీ ఆ పాత్రకు అవసరమైన పవిత్రత, సున్నితత్వం తనలో లేవని భావించి వెనక్కి తగ్గినట్లు విజయ్ వెల్లడించాడు. 'పెళ్లి చూపులు' తర్వాత 'రణబాలి' తనకు అత్యంత సంతృప్తినిచ్చిన చిత్రమని పేర్కొన్నాడు. తాను ఇప్పటికే ఈ సినిమాను రెండు మూడు సార్లు వీక్షించానని, సోమవారానికల్లా సెన్సార్ కార్యక్రమాలు కూడా పూర్తవుతాయని తెలిపాడు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528